# బోనులో నాన్న!

"కాలేజీ నుంచి అమ్మాయింకా రాలేదండీ. నాకు కాళ్ళూ చేతులూ ఆడటం లేదు. మీరు వెంటనే రండీ"

"ఛ...ఆ ఏడుపేమిటీ ఊరుకో. వచ్చేస్తుందిలే. ఏ ఫ్రెండ్ ఇంటికో వెళ్ళి ఉంటుంది"

"తన ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసానండీ. ఇవాళసలు కాలేజీకే రాలేదుట!"

పెదవి కొరుక్కుంటూ వాచీలోకి చూసాడు వాసుదేవరావు. రాత్రి ఎనిమిదిన్నర.

"నేనిప్పుడే బయల్దేరతాను గాని నువ్వు ధైర్యంగా ఉండు. దీపిక నిజంగా దీపకళిక. నా కూతురు!"

ఆ చివరి ముక్కని కించిత్తు గర్వంగా చెప్పి ఫోన్ పెట్టేసాడు వాసుదేవరావు.

అతడి గుండెల్లో భయం ఉత్తుంగ తరంగమై లేచిపడుతోంది, పడి లేస్తోంది.

కళ్ళముందు కూతురి రూపం మెదిలింది.

దీపిక మెరుపుతీగలా ఉంటుంది. రెండు నెలల క్రితమే పద్దెనిమిదో పుట్టినరోజు జరుపుకుంది. తండ్రి పోలిక వచ్చింది గనుక అదృష్టవంతురాలవు తుందంటూ ఉంటారు బంధుమిత్రులు.

చదువులో ఫస్టు. ఇంటర్ ఫస్టియర్లో 92 శాతం తెచ్చుకుంది. చదువుల సరస్వతి గనుకే తన శక్తికి మించిన పనే అయినా కార్పోరేట్ కాలేజీలో చదివిస్తున్నాడు. ఎంసెట్‌లో చక్కని ర్యాంక్ వస్తుందన్నారు కాలేజీవాళ్ళు. ఎలాగైనా ఇంజినీరింగ్ చదివించాలని బ్యాంకులో ఎడ్యుకేషనల్ లోన్ కోసం వివరాలు సేకరించి పెట్టు కున్నాడు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా దీపిక చురుగ్గా పాల్గొంటూ ఉంటుంది. కాలేజీలోని ప్రతి కార్యక్రమానికీ యాంకరింగ్ చేస్తుంది. తను ప్రత్యేకమైన దాన్ననుకుంటుంది. విభిన్నంగా ప్రవర్తించడమే 'హీరోయిజ' మన్న భ్రమా ఉంది.

సినిమా పిచ్చీ ఎక్కువే. సినిమా వాళ్ళు కుర్రకారు కలల్ని క్యాష్ చేసుకోవాలని చూస్తుంటారని చెప్పాడోసారి. నిజంగా జరిగిన కథల్నే సినిమాలుగా తీస్తుంటారంది అమాయకంగా!

"అర్జెంటుగా ఇంటికెళ్ళాలి మూర్తీ!" కొలీగ్‌తో అన్నాడు వాసు.

నవ్వాడతడు. "ఆడిటింగ్ జరుగుతోందిగా. టీం వెళ్ళేవరకూ మనకు జాగరణ తప్పదు" -

విషయం చెప్పాడు.

వాసుని వెంటబెట్టుకుని బాస్ దగ్గరికెళ్ళాడు మూర్తి. సంగతి టూకీగా చెప్పాడు. అతడి ఫైల్స్ ఆడిటింగ్ టీంకి తను చూపిస్తానని హామీ ఇచ్చాడు. అయిష్టంగానే అనుమతి ఇచ్చాడాయన.

మూర్తి స్కూటర్ తీసుకుని తిన్నగా కాలేజీకి వెళ్ళాడు వాసు. తాళంకప్ప వేలాడుతోంది. దీపిక ఫ్రెండ్ రాధిక ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు.

"దీపికింకా ఇంటికి రాలేదమ్మా. ఎక్కడికెళ్ళిందో నీకేమైనా తెలుసా?"

"తెలీదంకుల్! ఇవాళ కాలేజీకి బంకుకొట్టింది" అందా అమ్మాయి.

"ఇందాక మీ మిస్సెస్ ఫోన్ చేసారు. వెంటనే తన ఫ్రెండ్సందరికీ ఫోన్ చేసి కనుక్కుంది మా అమ్మాయి. ఎవ్వరికీ కన్పించలేదుట" రాధిక తండ్రి కల్పించుకు నన్నాడు.

నిట్టూర్చి లేచాడు వాసు.

"నువ్వేం వర్రీకాకు. కాదంటే ఇంటర్ స్టేజ్ ఉందే అది వరస్ట్ దశ. స్కూల్లో చదువుతున్నంత కాలం తలొంచుకునుంటారు. బుద్ధిగా ఉంటారు. కాలేజీలో అడుగుపెట్టీ పెట్టగానే ఒక్కసారిగా పెద్దవాళ్ళై పోయినట్టు అమాంతం రెక్కలొచ్చినట్టు ఫీలవుతారు. చదువులో సీరియస్‌గా కూరుకుపోవచ్చు, లేదా దారి తప్పనూ వచ్చు. మనమే వేయి కళ్ళతో కనిపెట్టుకునుండాలి"

"మా అమ్మాయి దారితప్పే బాపతు కాదులెండి. తనమీద నాకు పూర్తి నమ్మకముంది"

వెనుదిరిగి వచ్చేస్తోంటే వెనుక నుంచి ఆయన మాటలు విన్పించాయి.

"ఇంక ఈ వెతుకుళ్ళెందుకో!"

అవమానంగా అన్పించింది. కూతురిమీద కోపం బుస్సున పొంగింది. విసురుగా స్కూటర్ స్టార్ట్ చేసి తిన్నగా ఇంటికెళ్ళిపోయాడు.

"అమ్మాయి కన్పించిందా?"

తల అడ్డంగా ఊపాడు.

"ఇంకెక్కడికి వెళ్ళుంటుందా పాపిష్టిదీ!" నేలమీద కూలబడిందతడి భార్య. మెట్లమీద కూర్చున్నాడు. ఎంత ఆలోచించినా సహేతుక కారణం దొరకలేదు.

ఒకవేళ క్లాసులో తిట్టారనో, మార్కులు తగ్గాయనో అభిమానం గాయపడగా ఆవేశానికిలోనై అఘాయిత్యానికి......!

పాము మెడలో పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు. ఇప్పుడే వస్తానని చెప్పి తిన్నగా ఆఫీసుకెళ్ళాడు వాసు.

ఆడిటింగ్ టీంని బాస్ డిన్నర్‌కి తీసుకెళ్ళడంతో బయల్దేరడానికి సిద్ధమవుతున్నాడు మూర్తి.

అతడ్ని తీసుకుని రైల్వేస్టేషన్‌కెళ్ళారు. రైలు పట్టాల వెంబడి వెతికారు. ఎలాంటి ఘోరమూ జరగలేదని గ్రహించి నిట్టూర్చారు.

మరేదో గుర్తురాగా ఊరవతలి మడుగు దగ్గరికెళ్ళారు. అప్పుడప్పుడూ కొందరందులో దూకి ఆత్మహత్య చేసుకోవడం కద్దు.

చీకట్లో తడుముకుంటూ పడుతూ లేస్తూ గాలించారు.

ఒడ్డున జోళ్ళుగాని, పుస్తకాలు గాని, బట్టలు గాని ఏవీ కన్పించలేదు.

"మరీ అంత పిరికిది కాదులే!" భరోసా చిక్కగా అన్నాడు వాసు.

"లవ్‌స్టోరీ ఏమైనా....." తనని తొలుస్తున్న అనుమానాన్ని బయటపెట్టాడు.

"ఛ......ఛ.....అలాంటి బాపతు కాదు. అది చిన్నపిల్లరా. ప్రతీదీ నాకు పూసగుచ్చినట్టు చెప్పడం చిన్నప్పట్నుంచీ దానికి అలవాటు. నా దగ్గరేమీ దాచదు. నేనూ నా అభిప్రాయాలని తనమీద రుద్దాలనెప్పుడూ ప్రయత్నించలేదు"

"కొందరు పిల్లలు ఇంట్లోనే బుద్ధిమంతులు వీధిలో కాదు. మనకి తెలీని కోణం ఉంటుందిరా"

"పెళ్ళి గురించి తొందర పడుతుందనుకోను. మొన్న సమ్మర్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సంబంధం వచ్చింది. అమ్మాయి నచ్చిందనీ కానీ కట్నం అక్కర్లేదనీ

కబురంపారు. డిగ్రీ అయినా తీసుకోకుండా పెళ్ళేమిటని కాదనేశాం. వారిమీద మా అమ్మాయీ నేనూ ఎన్నో జోకులు కూడా వేసుకున్నాం"

"మరైతే ఏం ఫ్రెండ్ బర్త్‌డేకో వెళ్ళి లేటయ్యిందని చెప్పి వాళ్ళింట్లో ఉండి పోయుండొచ్చు. నువ్వేం వర్రీకాకు. తెల్లారేసరికల్లా వచ్చేస్తుంది చూడు!" ధైర్యం చెప్పి ఇంటిదగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయాడు మూర్తి.

బావురుమంటోన్న ఇంట్లోకెళ్ళాడు. విషాద మూర్తిలా ఉంది రమణి.

ఏమీ అడక్కుండానే, ఏమీ చెప్పకుండానే అర్థమైపోయిందామెకి.

"దీపికకి ఏమై ఉంటుంది? కొంపతీసి ఆమెని ఎవరైనా కిడ్నాప్ చెయ్యలేదు కదా!"

ఊహూ! అవకాశం లేదు. తాము మధ్య తరగతిలో క్రింది స్థాయివాళ్ళు. ఒకవేళ కక్ష కట్టి లేదా మోహంతో ఆమెని బంధించి మానభం......!

కంగారుపడ్డారు. ఇద్దరికీ ఒకేసారి ఆ ఊహ కలిగింది. బెంబేలు పడుతూ ఒకరివంక ఒకరు చూసుకున్నారు.

మరుక్షణం పైటకొంగు నోట్లో కుక్కుకుని బావురుమందామె.

ఉబికి రాబోయిన కన్నీటిని బలవంతంగా నిగ్రహించుకుంటూ పూజామందిరం దగ్గరికెళ్ళి సాష్టాంగ పడ్డాడు. "నా బిడ్డని చల్లగా కాపాడు తండ్రీ!" అని ప్రార్థించాడు వాసు.

రాత్రంతా వెక్కిళ్ళు పడుతూ జాగరణ చేసారిద్దరూ.

తెల్లవారింది. దీపిక రాలేదు. మరెలాంటి కబురూ అందలేదు. ఇరుగుపొరుగుకి వార్త తెలిసి పోగయ్యారు. ఆరా తీశారు. యక్ష ప్రశ్నలేసారు. సానుభూతి ఒలకబోస్తూనే చెవులు కొరుక్కున్నారు.

"ఎమ్సెట్టో బ్రహ్మ ఎమ్సెట్టో విష్ణు ఎమ్సెట్టో పరమేశ్వర అయిపోయింది. అందులో ర్యాంక్ రాకపోతే బ్రతుకే లేనట్టు నూరిపోస్తున్నారు ఇంట్లోనూ కాలేజీలోనూ! ఆ ఒత్తిడి భరించలేక ఏ అఘాయిత్యానికో తలపడి ఉంటుంది. చేసిన కర్మ ఎక్కడికి పోతుందీ, అఘోరించండి!" ఛీత్కరించాడో ముసలాయన.

వాసు మాట్లాడలేదు. వాదించగల శక్తీ లేదు. ఇన్ని కాఫీనీళ్ళు గొంతులో పోసుకునెళ్ళి కాలేజీ ప్రిన్సిపాల్‌ని కలిశాడు.

అటెండెన్స్ రిజిస్టర్ తెప్పించుకుని చూశాడాయన.

"రెగ్యులర్లీ ఇర్రెగ్యులర్. గత రెండు నెలల్లో ఒక రోజొస్తే రెండ్రోజులు రాలేదు. క్వార్టర్లీ పరీక్షలూ రాయలేదు. అయినా మీకు చీమకుట్టినట్టయినా లేదా? పట్టించుకోవద్దా?" కోప్పడ్డాడాయన.

"రోజూ కాలేజీకనే ఇంట్లోంచి బయల్దేరుతోందండీ." నోట్సులు రాసుకుంటూ, ఎప్పట్లా చదువుకుంటూ ఎలాంటి అనుమానమూ రానివ్వని కూతురి ప్రవర్తనని గుర్తు చేసుకుంటూ అన్నాడు.

"ఆఁ .....గుర్తొచ్చింది. మీ అమ్మాయికి మీ జాబ్ వేయించాలని మీరు వాలంటరీ రిటైర్మెంట్‌కి అప్లై చేశారు కదూ?"

"లేదే!" మ్రాన్పడిపోతూ అన్నాడు.

"అలాగని చెప్పి వారం రోజుల క్రితం ఎస్సెస్సీ మెమో పట్టుకెళ్ళిందే!"

దిమ్మెరబోయాడు వాసు.

చిన్నపిల్ల ఎంత పెద్ద కబుర్లు చెప్పిందీ! అవునూ.... అబద్ధం చెప్పి టెన్త్‌క్లాస్ మెమో ఎందుకు తీసుకున్నట్టు? ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోందా? ఊహూ..... అయ్యుండదు. ఇంజినీరింగ్ చదివిస్తానని చెప్పటమే కాదు, అందుకోసం డబ్బు ఏర్పాట్లు చేస్తున్న సంగతీ దీపికకి తెలుసు.

"బాయ్ ఫ్రెండ్స్ ఉన్నారా?" ప్రిన్సిపాల్ అడిగారు.

అవుననీ కాదనీ చెప్పలేకపోయాడు. కూతుర్లో తనకి తెలీని పార్శ్వముందని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది మరి!

"సెల్‌ఫోన్లూ, నెట్లూ, ఛాటింగులూ యువతరాన్ని డేంజర్ జోన్లోకి నెట్టేస్తున్నాయి. పిల్లల్ని వేయికళ్ళతో కాపాడాలి. లేకపోతే సర్వనాశనమైపోతారు"

ఆయన వాగ్ధోరణి భరించలేక సెలవు తీసుకుని వచ్చేశాడు వాసు.

ఉసూరుమంటూ వచ్చిన భర్తని చూసి ఏడ్చేసింది. "మీకు చెప్పకుండా ఎప్పుడూ ఏ పనీ చేసెరగదు"

"ఎక్కడో అక్కడ బాగానే ఉంటుందిలే. ఏడుస్తూ కూర్చుని ఆరోగ్యం పాడుజేసుకోకు!" విసుక్కున్నాడు.

"జాడ తెలిసిందా?" ఏదో అనుమానం రాగా తేరిపారి చూస్తూ అడిగింది.

"ఊహూ........" అన్నాడు తప్ప టెన్త్ మెమో సంగతి బయటపెట్టలేదు.

ఫోన్ మ్రోగింది. లైన్లో బావమరిది. రమణి అతడికి చెప్పిందని అర్థమైంది.

"దీపిక సంగతేమీ తెలీలేదురా"

"కొట్టడం తిట్టడం లాంటివేం చెయ్యలేదు కదా బావా ? ఈ కాలపు పిల్లలు యమ సెన్సిటివ్. తల్లి తిట్టినా భరించలేకపోతున్నారు. నన్నడిగితే మీ పెంపకమేమీ బాగోలేదు బావా. ఒక్కతే పిల్ల అయితేనేం మరీ అంత గారాబం చేసి నెత్తినెక్కించుకుంటే ఇలాగే ఉంటుంది వ్యవహారం!"

చటుక్కున రిసీవర్ పెట్టేసాడు వాసు. నిన్నటిదాకా తనని మెచ్చుకున్నవాళ్ళే అంతా. ఈ చిన్ని ఘటనతో తనని దోషిని చేస్తున్నారు!

పోలీస్ కానిస్టేబులొచ్చాడు. భయభ్రాంతులై చూశారు.

"స్టేషన్‌కి రావాలి. సి.ఐ. సార్ పిలుచుకు రమ్మన్నారు"

"ఈయనెందుకు రావాలి? ఈయనెప్పుడూ ఎలాంటి తప్పూ చెయ్యలేదు. చీమకి కూడా అపకారం చెయ్యని మనిషి" వాసుకి అడ్డంగా నిలబడింది రమణి. కోపం, దుఃఖం జంటగా కుదిపేస్తున్నాయామెని.

"నేరస్తుల్నే స్టేషన్‌కి పిలుస్తారనుకోకు. నువ్వుండు నేను మాట్లాడతా. నిన్నట్నుంచీ మా అమ్మాయి కన్పించట్లేదు. మేం క్రిందా మీదా అవుతున్నాం....."

"ఆ సంగతి మాట్లాడటానికే రమ్మన్నారు"

"మా అమ్మాయి కన్పించిందా? క్షేమంగా ఉంది కదా!"

"నిక్షేపంలా ఉంది. త్వరగా పద....."

భార్యాభర్తల మొహాల్లో ఆనందం గుప్పుమని వెలిగింది.

"అమ్మాయి క్షేమంగా ఉంది. అదే పదివేలు!" అనుకున్నారు.

చొక్కా తొడుక్కుంటూ "నే వెళ్ళి తీసుకొస్తానుగా. నిశ్చింతగా ఉండు" అన్నాడు వాసు భార్యతో.

"దీపిక తిన్నగా ఇంటికి రాక పోలీస్ స్టేషన్‌కి ఎందుకెళ్ళిందండీ?"

రమణి సందేహానికి బదులివ్వకుండా కానిస్టేబుల్ మోపెడ్ మీద స్టేషన్‌కెళ్ళాడు వాసు.

తొలిసారిగా పోలీస్ స్టేషన్లో అడుగుపెట్టినందున అతడి గుండెలకి చెమట

పట్టింది.

"నువ్వేనా దీపిక తండ్రివి? నీ నుంచి రక్షణ కావాలని నీ కూతురు అర్జీ పెట్టుకుంది"

సి.ఐ. మాటలకు నవ్వొచ్చింది. సభ్యత కాదని కంట్రోల్ చేసుకున్నాడు.

"కన్నబిడ్డకి రక్షణ ఇవ్వాల్సినవాణ్ణి నేను. ఆమె బాగోగులు చూడాల్సివాణ్ణి నేను. నా నుండి తనకి రక్షణ కావాలా? చిత్రంగా ఉంది కదండీ!"

విసుగ్గా చూసాడతడు. "అదంతా అనవసరం. ఆమె జోలికెళ్ళకూడదు. ఆమెకెలాంటి అపకారం తలపెట్టకూడదు. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించకూడదు. అలా అని రాసివ్వు!"

పేపర్ ముందుకి త్రోశాడు సి.ఐ. అయోమయంగా చూశాడు వాసు.

"ఇదంతా ఏమిటో, ఎందుకో నాకేమీ బోధపడటం లేదండి"

"సంగతి తెలీలేదా? నీ కూతురు ఎవడ్నో ప్రేమించి ఆర్యసమాజ్‌లో పెళ్ళి చేసుకుంది"

షాక్ తిన్నాడు. మెదడు మొద్దుబారిపోయింది. కన్నీళ్ళు ఉబికి వచ్చాయి.

"అదింకా చిన్నపిల్ల సార్!"

"మైనార్టీ తీరింది. టెన్త్ సర్టిఫికెట్ సాక్ష్యం ఉంది"

"ఇంటర్ చదువుతున్న పిల్ల. దానిగురించి దానికే సరిగ్గా తెలీదు. ఇక పెళ్ళిలాంటి విషయాలేం తెలుస్తాయి దాని మొహం!"

"ష్.... ఆమె నిర్ణయానికి అడ్డురానని, ఆమె వ్యవహారంలో జోక్యం చేసుకోననీ రాసిమ్మన్నాగా, రాసియ్యి...." కోప్పడ్డాడు.

"నా బిడ్డకి నా శక్తిమేరకు సాయపడ్తాను కాని హాని తలపెట్టను" అని రాసిచ్చాడు వాసు.

"ఇదేంటి? ఏం రాయమంటే ఏం రాశావ్? నువ్వే అక్కర్లేదు మొర్రో అంటుంటే సాయం చేస్తానంటావేంటి? ఏం మనిషివయ్యా నువ్వు. నువ్వేం చెయ్యననీ తన బతుకు తనని బతకనిస్తాననీ రెండు ముక్కలు రాసియ్యి చాలు" అరుస్తూ విసుక్కున్నాడు.

"ఆమె చేసిన తప్పేమిటో, తొందరపాటేమిటో విడమర్చి వివరిస్తాం.

నచ్చచెబుతాం. వినకుంటే తప్పదంటే ఇన్ని అక్షింతలేసి అక్కున చేర్చుకుంటాం గాని వీధిలోకి తోసెయ్యం"

"అదే.... ఆ నచ్చ చెప్పడమే వద్దనేది. ఫోర్సు ఉపయోగించి జంటని విడదీస్తారని నీ కూతురి భయం. ఆమె మానాన ఆమెని బతకనిస్తానని రాసివ్వు చాలు. ఇంతోటి కేసుకే ఇంత టైము తింటే ఇంక మేం డ్యూటీ చేసినట్టే!"

మరి చేసేదిలేక ఆయన చెప్పినట్టే రాసిచ్చాడు.

"ఆమె విషయాల్లో జోక్యం చేసుకుంటే మేటర్ సీరియస్సవుద్ది జాగ్రత్త!"

అతడి హెచ్చరికకి కళ్ళు చెమ్మగిల్లగా తలాడించాడు. 'అద్దాలనాడే బిడ్డలు.....' అని గొణుక్కుంటూ బయటికి నడిచాడు.

అల్లంతదూరాన చెట్టుకింద సిమ్మెంటు బెంచీమీద కూర్చునున్న దీపిక కన్పించింది.

చిన్నారి పొన్నారి దీపిక చీర కట్టుకుని మెడలో పసుపుతాడుతో రాత్రికి రాత్రే పెద్దదైనట్టుగా ఉంది. ఆమె ప్రక్కన దిక్కులు చూస్తూ ఓ యువకుడున్నాడు.

తండ్రిని చూసి తల తిప్పేసుకుందామె.

గుండెల్ని ఉక్కు హస్తాలతో మెలితిప్పినంత బాధపడ్డాడు.

ఈ బిడ్డకే కదూ తన గోరుముద్దలు తినిపించిందీ! ఈమె చేయి పట్టుకునే కదూ నడక నేర్పిందీ! ఈ చిన్నారి పుస్తకాల సంచీ మోస్తూనే కదూ స్కూలుకి తీసుకెళ్ళిందీ! ఈ అమ్మాయికే కదూ కథలూ, కబుర్లూ చెప్పిందీ! ఈమె ఆనందం కోసమే, ఉన్నతి కోసమే కదూ తన చిన్న చిన్న కోర్కెలు సైతం చంపుకుని అహరహం తపించిందీ!

అలాటి బిడ్డకివాళ తను పరాయివాడయ్యాడు. మొహం చూడటానికే ఇష్టపడనంత శత్రువయ్యాడు.

ఇది తను చేసిన పాపమా! కన్న హృదయాలకి దేవుడిచ్చిన శాపమా? మరో అడుగు ముందుకేశాడో లేదో టి.వి. ఛానల్స్‌వారు వాసుని చుట్టుముట్టేశారు.

వీళ్ళు దీపికనీ, ఆమె భర్తనీ ఇంటర్వ్యూ చేసే ఉంటారు. ఇహ వారిని హీరో హీరోయిన్లు చేసి ఆకాశానికెత్తేస్తూ పదినిమిషాలకోసారి చూపిస్తారు. మీరేమంటారంటూ దారినపోయే వాళ్ళనీ అడుగుతారు. ఏమయ్యింది? ఇలా ఎందుకయ్యిందన్న ఆలోచన

రేకెత్తించరు. ఎలా ఉండాలో చెప్పరు. గాలిలోంచి సుడిగాలి సృష్టించి బ్రేకింగ్ న్యూస్‌లూ, సెన్సేషనల్ న్యూసూ వండేస్తారు. వాణిజ్య ప్రకటనల్ని దండు కుంటారు. హు..... ఫోర్త్ ఎస్టేట్!

"మీ అమ్మాయి వివాహాన్ని మీరు ఆమోదిస్తున్నారా? ఆమెనీ అల్లుడ్నీ ఆదరిస్తారా? వారిని మీలో చేర్చుకుంటారా? మీ ఆస్తులకి వారసుల్ని చేస్తారా? మిమ్మల్ని కాదని పెళ్ళి చేసుకున్నందుకు కక్ష కడతారా? వారిని వేరు చెయ్యాలని ప్రయత్నిస్తారా? మీ అభీష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు శపిస్తున్నారా? మీ ఫీలింగ్సేమిటి? మీ కామెంట్సేమిటి? ఇంతకీ మీరు మీ అమ్మాయి పాలిట విలనా. హీరోయా?"

ఎన్నెన్నో ప్రశ్నల బాణాలు!

టీ కప్పులో తుఫాను సృష్టించే ప్రయత్నం! తమ వ్యాపారం పెంచుకోవాలన్న ఆరాటం !

"చూడండి! నాకేం ఆస్తిపాస్తుల్లేవు. సామాన్యుడ్ని. కనీసం విద్యాధనాన్నైనా నా కూతురికి ఇవ్వాలనుకున్నాను. నాకా అదృష్టం ఉన్నట్టులేదు. మమ్మల్ని కాదని పెళ్ళి చేసుకున్నంత మాత్రాన దీపిక నా కూతురు కాకపోదు, నేనామె తండ్రిని కాకపోను. ఆమె ఏం చేసినా ఎక్కడ ఉన్నా ఆమె సుఖాన్నే సంతోషాన్నే కోరుకుంటాం తప్ప, చెడు జరగాలని ఛస్తే కోరుకోం. శపించం.

మేం ఆత్మీయతానురాగాలు పంచే తల్లిదండ్రులంగాని దుర్మార్గులం కాదు. నిన్నట్నుంచీ మేం పడ్డ మథన, అనుభవించిన క్షోభ, ఎదుర్కొన్న పీడకలలు, అనుభవించిన దుఃఖం అర్థం కావాలంటే మీరు కన్నవారు కావాలి. మనసున్న వారు కావాలి. ఇంతకంటే ఏమీ చెప్పలేను. నమస్తే!"

**(చిత్ర సకుటుంబ మాసపత్రిక నవంబర్ 2010)**